ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆపరేషన్ సిందూర్ తో భారతదేశ ఆయుధ శక్తిని ప్రపంచం వీక్షించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- పాకిస్తాన్ దాడులలో దెబ్బ తిన్న ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే పునరావాస ప్యాకేజీ అందిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.
- తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద శిబిరాలను పాకిస్తాన్ పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ డిమాండ్ చేశారు.
- బిజేపి నాయకత్వంలోని అఖిల పక్ష ఎంపీల బృందం ఈరోజు డెన్మార్క్ పార్లమెంట్ విదేశీ విధాన కమిటీతో సమావేశమయ్యింది.
- సాంకేతికత అనేది అందరికీ అందుబాటులో ఉండాలని కేంద్ర సమాచార సాంకేతికత శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ తో భారతదేశం స్వయంగా తయారు చేసుకున్న ఆయుధ శక్తిని ప్రపంచం చూసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. స్వదేశీ ఆయుధాలే పాకిస్థాన్ కు గుణపాఠం చెప్పాయని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 47 వేల 600 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ఆయన ప్రారంభించడంతో పాటు, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ, భారత దేశం అణు బాంబులకు కానీ ఉగ్ర దాడులకు కానీ భయపడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు తగిన జవాబు చెప్పే సత్తా భారత్ కి ఉందని ఆయన వెల్లడించారు. భారత రక్షణ వ్యవస్థ ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తితోనే రూపొందిందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని అఖిల పక్ష ఎంపీల బృందం ఈరోజు డెన్మార్క్ పార్లమెంట్ విదేశీ విధాన కమిటీ చైర్మన్ క్రిస్టియన్ ఫ్రీస్ తో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా భారతదేశం ఉగ్రవాద దాడులకు ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ గురించి అఖిల పక్ష ఎంపీల బృందం తెలియచేసింది. ఆపరేషన్ సింధూర్ ని ఎందుకు మొదలుపెట్టాల్సి వచ్చిందన్న దానిపై వివరించింది. ఈ బృందానికి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహించారు. కాగా, ఉగ్రవాద వ్యతిరేక వైఖరిని డెన్మార్క్ తీసుకోవడం పట్ల అఖిల పక్ష ఎంపీల బృందం అభినందించింది. మరో వైపు.. ఇండోనేషియాలో పర్యటిస్తున్న భారత్ ఎంపీల బృందంలోని సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. ఇండోనేషియా పర్యటనలో భాగంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. 'ఆర్టికల్ 370తో కశ్మీర్ ఓ ప్రత్యేకమైన ప్రాంతమనే భావన ఉండేదని, అయితే.. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేశాక ఈ భావన తొలగిపోయిందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద శిబిరాలను పాకిస్తాన్ పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ డిమాండ్ చేశారు. ఇది పాకిస్థాన్ కే ప్రయోజనకరమని ఆయన హితవు పలికారు. గోవాలోని విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ లో నావికాదళ సభ్యులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాకిస్తాన్ భూభాగం నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో సరిహద్దులలో సముద్ర మార్గాల ద్వారా ఉగ్రవాదులపై ఎలాంటి చర్యలకైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.
పాకిస్తాన్ సైన్యాన్ని కట్టడి చేయడంలో భారత నావికా దళం విజయం సాధించిందని కేంద్రమంత్రి నాథ్ సింగ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 24సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నర్సింగ్ రంగంలో తమ ప్రతిభను చాటిన 15 మంది నిపుణులకు నేషనల్ ఫ్లోరెన్స్ నైట్‌గేల్ అవార్డులు-2025 ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందచేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో 15 నర్సింగ్ వృత్తి నిపుణులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, సహాయమంత్రులు అనుప్రియా పటేల్, ప్రతాప్ రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్ దాడులలో దెబ్బ తిన్న ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం త్వరలోనే పునరావాస ప్యాకేజీ అందిస్తుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్ లోని పూంచ్ జిల్లాలో ఈరోజు పర్యటించిన ఆయన పాకిస్థాన్ దాడులలో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ దాడుల్లో మరణించినవారి కుటుంబాలను పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం బాధిత కుటుంబాల్లోని యువకులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, ఎలాంటి అవాంతరాలు ఎదురైనా, జమ్మూకశ్మీర్‌లో ప్రారంభమైన అభివృద్ధి కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారతదేశానికి హాని తలపెట్టాలని చూసిన వారికి తగిన రీతిలో సమాధానం ఇస్తామని కేంద్ర హోం మంత్రి హెచ్చరిస్తూ..

(వాయిస్ బైట్...33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబంధించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి శబ్ద పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకు 800 కి పైగా వార్తా కథనాలను 15 భాషల్లో శబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. అయితే ఈ శబ్ద్ పోర్టల్ లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్ మొదలుకొని ఇప్పుడు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని, ఎటువంటి కాపీ రైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతికత అనేది అందరికీ అందుబాటులో ఉండాలని కేంద్ర సమాచార సాంకేతికత శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఆకాంక్షించారు. అత్యాధునిక సాంకేతిక ఫలితాలు ప్రజలందరూ పొందినపుడే సమగ్రమైన అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత్ లో కృత్రిమ మేధను తయారు చేయండి, భారత్ కోసం కృత్రిమ మేధతో పని చేయించండి' అనే పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో కృత్రిమ మేధను అందిపుచ్చుకునేందుకు తగిన ప్రోత్సాహం కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని అన్నారు. కృత్రిమ మేధతో భారతదేశ ప్రగతి మరింత వేగం పుంజుకుంటోందని అశ్విని వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో జూన్ 15వ తేదీన జరిగే పోస్ట్‌గ్రాడ్యుయేట్ (NEET-PG)-2025ను రెండు షిఫ్టులలో కాకుండా ఒకే షిఫ్టులో నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పరీక్షను ఒకే షిఫ్టులో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని ఆదేశించింది. కాగా, కేంద్ర విద్యాశాఖ తొలుత 2 షిఫ్టుల్లో నీట్ పీజీ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించగా.. దీనిపై అభ్యంతరం తెలుపుతూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఒకే షిఫ్ట్‌లో ఈ పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.

==============================

భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని రిజర్వ్ బ్యాంక్ 2025-26 వార్షిక నివేదిక పేర్కొంది. భారత్ ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని నిలుపుకుంటోందని తెలిపింది.

==============================
==============================